# మహావనజ్యోత్స్న

## కలువకోలను సదానంద



దగ్గరలో ఉన్న గుట్టలోని ఎగుడు దిగుళ్ళు స్పష్టంగా అవుపిస్తున్నాయి. కానీ, ఆకాశపుటంచును చుంబిస్తున్న దూరపు కొండతలలో అంతటి నునుపుదనం ఎక్కడిదీ? మృగతృష్ణ లాగా అది కేవలం భ్రమేనేమో? దూరపు కొండ దగ్గరైతే కానీ దాని నునుపుదనంలోని నిజా నిజాలు బయట పడవు. ఈ సత్యాసత్యాల అన్వేషణ కోసమేనేమో భాస్కరం బయలు దేరాడు.



ఇంట్లో తగువు లాడిన భాస్కరం నేరుగాకట్టుగుడ్డలతో తన అక్కయ్య ఇంటికి వెళ్ళిపోయాడు. అక్కయ్యంటే స్వయానా అక్కయ్య కాదు. పెద్దమ్మ కూతురు. పది మైళ్ళలో ఉన్న పల్లెటూళ్లో కాపురముంటోంది. ఆమె భర్త బడిపంతులు. మొత్తం అరడజను పిల్లలు ఇప్పటికి.

చెరువు కట్ట మీద నడుస్తూ వాళ్ళ పేర్లన్నీ గుర్తుకు తెచ్చుకోడానికి ప్రయత్నిస్తున్నాడు భాస్కరం. పెద్దమ్మాయి పేరు సుశీల. తర్వాత రవిబాబు. ఆ వెనుక రమణి, చందూ, వెంకూ, చంటి. చంటి ఇంకా తప్పటడుగైనా వెయ్యలేని చంటిబిడ్డ. ఆ మధ్య బిడ్డతోపాటు సినిమా చూడ్డానికని టౌను కొస్తే చూశారు తనను. అప్పుడు తనని పిలిచింది— "వెళ్దాం రారా, ఓ నాలుగు రోజులపాటు ఉండి వద్దువుగాని" అని. తనకు వెళ్లాలనిపించలేదప్పుడు. "ఇప్పుడెందుకులే? ఇంకెప్పుడయినా వస్తా" అన్నాడు.

అన్నయ్యతో దెబ్బలాడాడు తాను. వీధి వీధి తిరుగుతున్నాట్ట తను. ఇంట్లో ఒక్కనిముషం ఉండటం లేదట. ఒక్క పనికీ కొరగాకుండా తేరగా తింటున్నాడట. "ఇంట్లో లేకుండా ఎక్కడి కెళ్లావురా వెధవా?" అన్నాడు. అని, చెంపమీద ఛెళ్లున అంటించాడు. తన కళ్ళలో నీళ్లు తిరిగాయి. కోపమొచ్చింది. "నా ఇష్టం. నేనెక్కడికైనా వెళతాను" అంటూ తిరగబడ్డాడు తను. ఈసారి అను..." అంటూ చితకబాది, బయటికి గెంటి, ఇంట్లోకొస్తే తోలు ఒలిచేస్తాను వెధవా వెళ్లు. అటే వెళ్లు..." అంటూ దభేలున తలుపు వేసుకున్నాడు. భోరున ఏడ్చాడు భాస్కరం. ఏడ్చి ఏడ్చి, కన్నీళ్లన్నీ కారిపోయాక, "ఛా! ఎందుకు ఏడ్చావా ఆడదానిలాగా?" అనుకున్నాడు. తాటిమానెత్తు రోషం వచ్చేసింది. కళ్ళొత్తుకుంటూ లేచి నిలబడి, నిబ్బరంగా చేతులు చరుచుకున్నాడు.

విసురుగా తలుపు దగ్గరికెళ్లి రెండు మూడుసార్లు తట్టి "ఒరేయ్ శంకరం" ఇదో, వెళ్లి పోతున్నాను. మళ్లీ ఈ ఇంట్లో కాలు పెట్టను. మళ్ళీ నీ మొహం గనక చూస్తే, లేట్ గోవిందయ్య చిన్న కొడుకు భాస్కరమే కాను. హె! ఏమనుకున్నావో నన్ను!" అనేసి వీధుల్లోకి అలా అలా వెళ్ళిపోయాడు.

"వాడు కొడుతుంటే కిక్కురుమనకుండా కుక్కలా పడి ఉండగలిగిన అల్పుణ్ణా నేను?... నాకూ సిగ్గెగ్గులున్నాయి, చీమూ నెత్తురూ ఉన్నాయి. నాకు రోషం లేదనుకున్నాడు కాబోలు" అనుకున్నాడు.

ఉద్రేకమంతా చల్లారిపోయాక మనసంతా ఏదో దిగాలుతో నిండిపోయింది. పైకి అనేశాడు గానీ,

ఎక్కడికెళ్తాడు తానిప్పుడు? ఎక్కడుంటాడు? ఎలా గడుపు తాడు? ప్రొద్దు పోయాక చిన్నగా ఇంటికే వెళ్లిపోతే.. మళ్లీ అభిమానంతో బిర్ర బిగుసుకు పోయాడు. ఛా! ఇంటికి వెళ్లడమా... అంతా అయోమయంగా ఉంది. అమ్మమీద వెద్దకోపం పుట్టుకొచ్చింది. వాడు తనను అలా కొడుతుంటే చూస్తూ ఊరుకుందేగానీ, మనిషేమైనా కాస్త కదిలిందా? కలగ జేసుకుందా?'' అంతా నా మీద పగబట్టారు'' అనుకున్నాడు. కళ్ళు నీళ్ళతో కూరుకు పోయాయి.

ఇటువంటి విపత్సమయంలో ఉన్నట్లుండి జ్ఞాపకం వచ్చింది రాధక్క. రాధక్క తనను రమ్మంది. ఇప్పుడు తాను వెళ్తేనేం... ఔను! తప్పకుండా వెళ్లాలి. ఈ శంకరం గాడితో తనకేం మని? ''మాటంటే మాట! ఏమనుకున్నాడో ఈ భాస్కరం గాణ్ణి!'' అనుకున్నాడు.

చేతిలో రాగి కానీ లేదు. రూపాయైనా ఉంటే బస్సులో వెళ్లి పోవచ్చు. కట్టుగుడ్డలతోనే, నడిచే బయలు దేరాడు.

చెరువు కట్ట దిగుతుంటే అతని గుండెలు కొట్టుకున్నాయి. తనుఎక్కడికి వెళ్తున్నాడు? రాధక్క ఇంటికి. ఎవరీ రాధక్క? తన సొంత అక్కనా? కాదే! మరి ఎందుకు వెళ్తున్నాడు తను? ఈ రాధక్క తనను సత్కరిస్తుందా?... ఆదరిస్తుందా?

వెళ్ళగానే ఏం మాట్లాడాలి? వాళ్ళను ఎలా పలకరించాలి? వాళ్ళ ప్రశ్నలకు ఎలా సమాధానమివ్వాలి? మరొకప్పుడైతే అతనికిన్ని సందేహాలు కలక్క పోను. కానీ ఇప్పుడు ఇంటి నుండి పారిపోయి వచ్చాడు. తాను ఏకాకినేమో అనిపిస్తోంది. దిక్కులేని వారూ, దేశదిమ్మరిలా వెళ్తున్నాడు మరొకరింటికి. తనను చూసి అసలు సంగతి పసిగట్టేస్తారేమో? దిక్కూ దివాణం లేక ఇలా వచ్చి పడ్డాడనుకుంటారో, ఏమో! తనని నిరసనగా చూసి, చులకన చేస్తారేమో!

పిల్లలు జ్ఞాపకం వచ్చారు. ఒక మంద! వీళ్ళందరికీ తినుబండారాలు ఏవీ తీసుకుపోవడం లేదు తను. తాను వెళ్ళగానే మీద బడతారు. పిప్పరమెంట్లకోసమో, పకోడీల కోసమో, పప్పుల కోసమో— ఆత్రుతతో తనని కింద నుండి పైదాకా చూస్తారు. ఆ చూపులకు ఏమని జవాబు చెప్పాలి? ''ఏమీ తెలీదు'' అంటే తనకెంత చిన్నతనం! ...మరలి పోదామనుకున్నాడు. వెంటనే ఆ విశ్వయాన్ని చంపుకున్నాడు. ''ఇంత దూరమూ వచ్చేశాక వెనక్కు వెళ్లి పోవడమేమిటి?... ఏం జరుగుతుందో అదే జరగనీ!'' అనుకుంటూ ఊళ్ళోకి నడిచాడు.

బిక్కు బిక్కుమంటూ ఇంట్లోపలకాలు బెట్టాడు.

''రా భాస్కరం! ఎప్పుడొచ్చావు?'' అంది రాధ.

''ఇప్పుడే!'' అన్నాడు.

బెంచీమీద పరుపు చుడుతోన్న శ్రీహరి బావ అతని వేపు చిరునవ్వుతో చూసి నిద్రకళ్ళతో పెరట్లోకి వెళ్లాడు.

పిల్లలంతా భాస్కరాన్ని చుట్టు ముట్టేశారు. నిక్కి నిక్కి దోసిళ్ళు చాపుతున్నారు. జేబుల్లో చేతులు వేస్తున్నారు. ఒంటి మీద తేళ్ళూ జెర్రులూ పాకుతున్నట్లుంది.

అక్కయ్య మంచి నీళ్ళు తేవడానికి లేచి వెళ్ళింది.

''పైసలు— పైసలివ్వు?'' అన్నాడు వెంకూ.

''నాకూ ఓ పావలా ఇవ్వు'' అన్నాడు చందూ.

దీనికన్నా ఏ రైలు కిందో పడి చచ్చి ఉంటే బావుండేదనుకున్నాడు... ''చిల్లర లేదురా!'' అన్నాడు చిన్నగా.

అక్కయ్య మంచినీళ్ళందిస్తూ ''అంతా బాగున్నారా?'' అనడిగింది.

''బాగున్నారు'' అన్నాడు.


''బస్సులోనా వచ్చావూ?'' అంది.

''ఊ!'' పరువుకోసం అబద్ధ మాడుతూంటే అతని మనస్సెంతో బాధపడింది. పదిమైళ్ళు నడిచినందుచేత కాళ్ళు నొప్పితో జివ్వుమంటున్నాయి.

మాటలు అంతటితో ఆగిపోయాయి. తర్వాత పలకరించే వాళ్ళెవరూ లేకపోవడంతో— మనసు చాలా కించబడింది. పిల్లిలా అడుగులో అడుగు వేసుకుంటూ వెళ్ళి పెరట్లో కాళ్ళూ చేతులూ కడుక్కున్నాడు.

సుశీల ఎక్కడో— కనిపించడం లేదు. రవిబాబు భాస్కరం బావ వచ్చాడని వినగానే పరుగెత్తుకొచ్చాడు.

అలా చెరువు పైకి వెళ్దాం రమ్మన్నాడు రవి. వాణ్ణి అనుసరించాడు భాస్కరం. కడుపులో ఆకలి కుప్పిగంతులేస్తోంది. మధ్యాహ్నం కూడా తిండి లేదు.



తన జన్మలో నడవలేదు అంత దూరం. బాగా అలిసి పోయాడు. పంచప్రాణాలన్నీ కన్నుల్లోకి చేరుకున్నాయి.

కట్టమీద నడుస్తోంటే, చెరువు దిగువ ఏపుగా పెరిగి ఉన్న చెరకు తోట అతనిలో ఆశను రేపింది. "ఒరేయ్ రవీ! చెరుకు ముక్క విరిచు కొస్తావుట్రా?" అన్నాడు. అలా అన్నప్పుడు అతని మొఖం సిగ్గుతో వంగిపోయింది. రవి చెరకుముక్క విరుచుకొచ్చాడు. ఎవరూ చూడకుండా— దగ్గరలో ఉన్న మర్రిచెట్టు చాటున కూర్చుని గల గల మని నమిలి తినేశారు. కాస్త ఊపిరి వచ్చినట్లు త్రేన్చి, పెదవులు చప్పరించుకున్నాడు భాస్కరం.

చెరువులో రేగుతున్న చిరు అలలు— పడమటి కొండల వెనుకకు గ్రుంకుతోన్న సూర్యదేవుని నిర్మల కాంతుల చేత స్పృశించబడి తళతళా మెరుస్తున్నాయి. చెరువు గట్లమీద గుడ్డి కొంగలు చేపల కోసం వేట సాగిస్తున్నాయి. పక్షులన్నీ కల కలమంటూ గూళ్ళకు తిరిగి వస్తున్నాయి.

రవితోపాటు ఇంటి వైపు నడిచాడు భాస్కరం. చీకట్లు అలుముకొనేసరికి వంట సిద్ధమైపోయింది. అందరూ వెళ్ళి భోంచేస్తున్నారు. అతనికి బిడియంగా ఉంది. రాధ పిలిచేంత వరకూ గానీ కదల్లేదు. వెళ్లి, భోజనం ముందు కూర్చున్నాడు. కంచంలో అన్నం పెట్టింది రాధ. కృంగిపోయాడు. తనకు తీరని పరాభవం జరుగుతోందని బాధపడ్డాడు. కంచం సరిగ్గానైనా కడగకుండా అసహ్యంగా ఉంది. కిక్కురుమనకుండా అన్నం తింటున్నాడు. చేయి అష్ట వంకర్లు తిరుగుతోంది. దవడలు చిన్నగా కదులు తున్నాయి. తినడానికి కూడా సిగ్గు వేస్తోంది. మెతు కులు నోట్లో నుండి కంచంలోనే పడిపోతున్నాయి. రెండు సార్లు పొర కూడా వచ్చింది. వాళ్ళందరి ముందరా తానో కుక్కపిల్లలా భావిస్తున్నాడు. ఎవరి మొహంలోకీ చూడలేకపోతున్నాడు.

సుశీల వైపు చూడ్డం జరిగింది. ఆమె అతన్ని ఓరకంట చూస్తోంది. ఆ చూపులకన్నా పాముకాట్లయినా నయిమేననుకున్నాడు. ఆమె చూపుల్లో ఏదో ఏహ్యాభావం కనిపించిందతనికి. మొదటిసారి అన్నం అయిపోవచ్చింది. మెల్లమెల్లగా తింటున్నాడు. "అన్నం కాస్త పెట్టు అక్కా!" అంటానికి గొంతు పెగిలి రావడంలేదు. అన్నం పూర్తయ్యే వరకు ఆమె చూడకపోయేసరికి— ఇక బాగుండదని, కంచంలోనే చెయ్యి కడుక్కున్నాడు. "అదేమిట్రా! అన్నం పెట్టుకోకుండానే...." అంది రాధ. "వొద్దక్కయ్యా! ఆకలే కావడం లేదు" అంటూ లేచిపోయాడు. నిజానికి చాలా ఆకలేస్తోంది. ఆత్మగౌరవం కోసం అలా అనక తప్పింది కాదు.

* * * *

కట్టు గుడ్డలతో చూసి పోవడానికన్నట్లు వచ్చి భాస్కరం నెలరోజులయినా కదలక పోయేసరికి రాధమ్మకు ఆశ్చర్యం కలిగింది. ఆమెలో ఏదో అనుమానం తలెత్తింది.

ఇంటికి వెళ్ళిపోవాలన్న కోరిక బలవత్తరమైపోతోంది భాస్కరానికి. తను ఇక్కడుండటం అందరికీ కంటి మెరమెరగా ఉంది. ముఖ్యంగా సుశీల విషయం అతన్ని ఎక్కువుగా బాధ పెట్టింది. సుశీల వయస్సు పన్నెండు పదమూడేళ్ళుంటాయి. అరమైలు దూరంలో ఉన్న పేటలో హైస్కూల్‌లో ఎనిమిదో తరగతి చదవుతోంది. సుశీల భాస్కరానికి కాబోయే భార్య. రెండు వర్గాల వారి మనస్సుల్లోని నిశ్చయమూ, నిర్ణయమూ అదే. అది భాస్కరానికి తెలుసు. అందుచేత బయటికి కాకపోయినా మనసులోనే ఆమె మీద ఒక హక్కును ఏర్పరచుకున్నాడు.

ఇంట్లో పిల్లలందరూ 'బావా' అంటారు భాస్కరాన్ని. కాని సుశీల అలా అనదు. సూటిగానే 'భాస్కరం' అంటుంది. "ఈ లెక్క వేసియ్యి భాస్కరం" "ఈ పాఠం చెప్పు భాస్కరం" "ఈ బొమ్మ గీచియ్యి భాస్కరం" అంటుంది. తన పట్ల ఆజ్ఞా పురస్సరంగా ఉంటాయి ఆమె మాటలు. ఆ సంబోధన తనకు దుస్సహంగా ఉంటుంది. పరోక్షంగానైనా 'బావా' అంటుందా అంటే— అదీ లేదు. "ఎవరూ లేకపోతేనేం, భాస్కరాన్ని పంపించమ్మా అంగడికి" అంటుంది "ఒరేయ్ తమ్ముళ్ళూ! పైసలు భాస్కరం కంట పడేసేరూ, లాక్కుంటాడు" అంటుంది. ఎందుకో దానికి తనమీద అంత అక్కసు? తనేమైనా బానిసగాడా?.. చిన్న తనమా అంటే పదమూడేళ్ళదానికి కుర్ర తనమేమిటి ఇంకా? తనను ఏదో వింత జంతువును చూచినట్లు చూస్తుంది. అది అలా చూసినప్పుడు మనస్సు కలుక్కుమంటుంది. "దీన్ని పెళ్ళి చేసుకొని బ్రతకలేమురా బాబూ! ఇది అపర చండికలా ఉంది" అంటూ ఆవురిస్తాయి గుండెలు. ఒక్కోసారి చెడ్డకోపం వస్తుంది. "దీన్ని పట్టు బట్టి పెళ్ళాడాలి. ఆ తర్వాత రోజూ చితక బాదాలి" అనుకుంటాడు.

... అలా శూర్పణఖలా చూడకపోతే, చిరునవ్వుతో ప్రసన్నంగా చూస్తేనేం? ఆనతిస్తూన్నట్లు మాట్లాడక పోతే, బ్రతిమాలుతున్నట్లు అడిగితేనేం?... తన మనస్సెంత సంతోషిస్తుంది! ఆమెపైన తనకేమన్నాపగనా?

మొన్నోరోజు— "వాడు చూడమ్మా ఆ భాస్కరం గాడు— గాడిదలా ఉన్నాడు, చిన్న పిల్లలతో చేరి ఎలా మిడిసి పడుతున్నాడో?" అంది, వంటింట్లో కెళ్లి. వాడు! తనను 'వాడు' అంది. మీదికి దూకి చెంపలు వాయగొడదామా అన్నంత కోపం వచ్చింది. తాను అశక్తుడు. ఏమీ చేయలేదు. పెరట్లోకి వెళ్ళి కన్నీరు కార్చి వచ్చాడు.

అతనికి నానాటికీ శాంతి దూరమై పోతోంది. పిల్లల మీద విసుగూ, చిరాకూ పుట్టుకొస్తోంది. వాళ్ళను చీదరించుకుంటున్నాడు. వాళ్ళు చాడీలు చెప్పడం నేర్చుకుంటున్నారు. ఇది పూర్తిగా పరాయి కొంప! ఈ ఇంట్లో తాను పరాయి వాడు. మాట్లాడాలంటే బిడియం, తినాలంటే బిడియం, ఇక్కడికి వచ్చిన నెల రోజుల్లోనూ మూడు సార్లు స్నానం చేశాడు. అంతే! అతని మీద శ్రద్ద తీసుకొని పరామర్శించేవారు లేరు. రామ/ రామా— అందరూ తనను చూలకన చేస్తున్నారు. గోతం సంచీ చేతికిచ్చి, మోదుగాకులూ, మర్రాకులూ కోసుకు రమ్మంటారు, గేదెను తోలుకు పోయి మేపుకు రమ్మంటారు, తన ప్రతిష్ట అంతా మంటగలిసి పోతోంది. ఒక్క గంట గడవడం ఒక్క యుగం గడిచినట్లుంది. బుద్ధి ఉంటే ఇక మీదట బంధువుల ఇళ్ళకు వచ్చినా పోకూడదనుకున్నాడు. అక్కడి నుండి త్వరగా వెళ్లిపోవాలి. ఇక జన్మలో మళ్ళీ ఆ గడప తొక్క కూడదు.

సొంతవూరిలో ఉంటే తనకిటువంటి మనఃక్లేశాలు వుండేవా? ఎంత కులాసాగా గడిచిపోయేవి రోజులు? తన పోషణ మీద శ్రద్ధవహించే తల్లి, తనగురించి మంచీ చెడ్డా అడిగి తెలుసుకునే సోదరుడు, తన చుట్టూ సంతోషంతో మూగే స్నేహితులు! ఇన్నాళ్ళూ సొంత వూరిలోనే ఉండి, సొంత వూళ్ళోనే ఇంటర్ దాకా చదివిన తనకు ఇప్పుడు ఎవరింటిలోనో పడి ఉండాలన్న పాడు బుద్ధి ఎందుకు కలగాలి?... చిక్కి పోయానేమో అనిపిస్తోంది. ఆరోగ్యం చెడుతోంది. ఒకే చొక్కా, ఒకే పంట్లాం— వీటినే ఉతికి ఉతికి తొడుక్కుంటున్నాడు.

ఇక ఏమైనా కానీ; రేపో మాపో వెళ్ళిపోవాలి. తన ఇంటికి తాను పోవాలి. అమ్మను చూడాలనిపిస్తోంది. అమ్మ తన కోసం బెంగ పెట్టుకుని ఉంటుంది. అన్నయ్య కూడా బాధపడుతూ ఉంటాడు. వెళ్ళి చూడాలి. ఈ నిమిషంలోనే వెళ్ళి పోయినా బావుండును. సుశీల తనను 'వాడు' అన్నప్పటి నుండి ఈ కోరిక ప్రబలిపోయిందతనిలో.

ఒక రోజు ప్రాతఃకాలాన అనుకోని విధంగా శంకరం ఊడిపడ్డాడు. ముసి ముసి నవ్వులు నవ్వుతూ భాస్కరాన్ని చూశాడు. భాస్కరం అతని మొహంలోకి చూడలేక, మొహం చాటుచేసుకుని, కనుకొలకుల్లో నిలిచిన బాష్పపురాలను ముంజేతులతో తుడుచుకున్నాడు.

ఆ సాయంకాలం— తనను, అన్నయ్యను మోసుకొని బస్సు తన వూరివైపు దూసుకు పోతుంటే— తేలిగ్గా నిట్టూర్చాడు భాస్కరం.

* * * *

మూడేళ్ళ తర్వాత ఒకనాటి మిట్టమధ్యాహ్నం బస్సుదిగి, హేండ్ బ్యాగ్‌తో చెరువు కట్టమీద నడిచి పోతున్నాడు భాస్కరం. ఆ నడకలో హుందాతనం! ఆ ముఖంలో గంభీర్యం! అప్పటి భాస్కరం కాదు ఇతను. ఆకారంలో ఒడ్డూ పొడుగూ ఏర్పడ్డాయి. శరీరం రంగు మారింది. బిగువైన కండరాలు, బిరు పెక్కిన ముఖం, ఆ మొఖానికి అందాలు తీరుస్తోన్న సన్నటి కోరమీసం. పరిశుద్ధమైన తలపులు!

ఇప్పుడతను ఒక ఉద్యోగి! సంపాదన పరుడు! అందుకే ఆ ఠీవి.

మూడేళ్ల క్రితం ఈ చెరువుకట్ట మీదే నడిచి పోయాడు తాను. కృంగిన మనస్సుతో నడిచి వెళ్ళాడప్పుడు. ఎన్నో సందేహాలతో వేగి పోయాడప్పుడు. ఇప్పుడటువంటి ఆందోళన ఏమీ లేదు. తాను సంపాదిస్తున్నాడు. చేతి నిండా డబ్బులున్నాయి. సంచీ

నిండా తిను బండారాలున్నాయి. సిగ్గు, బిడియం ఇప్పుడు లేవు తనకు! ఎందుకుండాలి? తనుపారిపోయి రావడం లేదుగా? చేత చిల్లి గవ్వలేదే అన్న బాధ లేదుగా? తాను దొరగా వెళ్తున్నాడిప్పుడు!

ఇక మీదట— రాధక్క ఇంటికి వచ్చినా వెళ్ళమా దదనుకున్నాడు అప్పుడు. కానీ, ఆ నిశ్చయం నానాటికీ వదలిపోయింది. సుశీలను చూడాలనిపించింది. వెళ్తే ఏం? తను నెల రోజులుగానీ కూర్చోబోవడం లేదు. ఒకటి రెండు రోజులుండి వచ్చేస్తాడు.

ద్వార బంధం తగలకుండా వంగి ఇంట్లోపలికి జొరబడ్డాడు భాస్కరం. తలుపు ప్రక్క కూర్చుని లేసు అల్లుకుంటోన్న సుశీల 'అమ్మోయ్' అంటూ ఉలిక్కి పడి లేచి నిలబడి ఒకటి రెండు క్షణాల్లోనే అతన్ని గుర్తుపట్టి సిగ్గుతో తడబడుతూ నట్టింట్లోకి వెళ్లి "అమ్మోయ్, లే! అటు చూడు!" అంది.

'ఏమిటే? ఎవరూ?" అంది రాధ.

"అబ్బబ్బ! నీకు నేను చెప్పలేను తల్లీ! మరి... శంకరం బావ..."

"ఏమిటి? శంకరం బావా?"

"కాదే! ఆయనగారి తమ్ముడుగారు"

"ఆ! భాస్కరమా? అది చెప్పడానికి ఇంత సిగ్గేమిటే నీకు?" అంటూ చంటిబిడ్డను భుజానవేసుకుని బయటి కొచ్చింది రాధ.

రాధ ఇంకో బిడ్డను కన్నదని తాను విన్నాడు. వాడే కాబోలు వీడు!

"ఏం భాస్కరం!! కంటికి కనిపించడమే గగనమై పోయిందా? రా! రా! బావున్నావా? రైల్వేలో ఎక్కడో ఉద్యోగం చేస్తున్నావటగా? ఎంత మారి పోయావురా! మూడేళ్ళయి పోతున్నెకదూ నిన్ను చూసి? ఒసేయ్! బావకు మంచినీళ్లు పట్టా! కూర్చోరా భాస్కరం. ఆ కుర్చీలాగి కూర్చో! అంతా బాగున్నారా? నువ్వొక్కడివే వచ్చావేమిటి?..." ఈ ప్రశ్న పరంపరతో ఉక్కిరి బిక్కిరై పోయాడు భాస్కరం. తగిన సమాధానాలిస్తూ బూట్లు విప్పి డ్రాయరు క్రింద పడేశాడు.

సుశీల నీళ్లు ముంచు కొచ్చి భాస్కరం దగ్గర నిలబడింది. ముగ్ధయై ఆపాదమస్తకం చూస్తూ, నీళ్ళు పుచ్చుకోవాలన్న మాటే మరిచిపోయాడు భాస్కరం.

"నీళ్ళు తీసుకో భాస్కరం" అని రాధక్క అనేవ రకు అలాగే ఉండిపోయాడు.

ఖాళీ గ్లాసు సుశీల చేతికందిస్తూ, "అది సరేగానీ అక్కా, పిల్లలంతా ఏరీ?" అన్నాడు.

"బడికెళ్లారు. వొస్తారులే!" అంది.

భాస్కరం వచ్చాడన్న వార్త ఎలా వెళ్ళిందోగానీ, పది నిముషాల్లో పిల్లలందరూ లోపలికి వచ్చిపడి, అతన్ని చుట్టు ముట్టేశారు. అందరికీ పిప్పర మెంట్లూ, బిస్కట్లూ, చాక్లెట్లూ అన్నీ పంచి పెట్టాడు. సాయంకాలం రవి వచ్చాడు. కానీ, బావను మునుపటిలా చెరువు గట్ల మీదికీ, చెరకు తోటల్లోకీ పిలిచే ధైర్యం లేకపోయింది. అంతగా మారి పోయాడు బావ.

"సాయంకాలం స్కూలు నుంచి శ్రీహరి బావ వ

> **'ఏది?'**
>
> భర్త:— ఏమేవ్—నువ్వు ఓ మహామేధావి కూతుర్నంటావుకదా—నా ప్రశ్నకు ఠకీమని రెండు మాటల్లో జవాబుచెప్పు—ఇప్పుడు, ఇక్కడ బాగాపనిచేసేది ఏది? పనిచెయ్యనిది ఏది?
>
> భార్య:— నా చూపు, మీ బుద్ధీ—
>
> —లక్ష్మి

చ్చాడు. అతనితో చాలా సేపు మాటల్లో మునిగి పోయాడు..." రెండు వందల మైళ్ల కవతల ఎక్కడో ఉన్నావే— హోటలు భోజనమే గామోలు! ఎన్నా ళ్లుంటావ్ అలా?" అన్నాడు శ్రీహరి.

రాధక్క చెప్పింది— "సుశీలను బడినుంచి మాన్పించేశాం భాస్కరం! పెద్దమనిషై సంవత్సరమై పోతోంది. ఏమిటో రా, విపరీతకాలం ముందు జాగ్రత్త మంచిదిగా? దాన్ని ఇంట్లో పెట్టుకుని ఉంటే నాకు అన్నం కూడా మింగుడు పడనంటోందిరా నాయనా!"

వాళ్ల మాటల్లోని అంతర్యమేమిటో ఇట్టే గ్రహిం చేశాడు భాస్కరం. కోట బురుజు పైకెక్కి కూర్చు న్నంత సంబరపడిపోయాడు.

అక్కడ మూడు రోజులున్నాడు. ఈ మూడు రోజుల్లోను సుశీలతో ఎక్కువ మాట్లాడలేదు. ఆమె ఏమేమో చేస్తుంది. తన ముందు నుంచి వెళ్తుంది. పాడి దగ్గు దగ్గుతుంది. పావడ అంచులు సవరించుకుం టుంది. వోణీ సరిజేసుకుంటుంది. తన వేపు అదే పనిగా చూస్తుంది. తను మాత్రం ఏమీ చలించడు.

రెండో రోజు సాయంత్రం రాధమ్మ పకోడీలు చేసింది. ఒక ప్లేటులో పకోడీలు పెట్టుకుని మంచి నీళ్ళ గ్లాసుతో భాస్కరం దగ్గరికి వచ్చింది సుశీల. అతను చూడనట్టు బయటకు వెళ్ళి పోతుంటే తడ బడుతున్న గొంతుతో అంది— "ఇదిగో, ఇదిగో బా..."మనసులోనే నవ్వుకున్నాడు. తిరిగి వచ్చి, పకోడీలు, గ్లాసు తనే అందుకున్నాడు. ఆ 'బా—'కు బావ అని అర్థం చెప్పకున్నా, ఆమె 'భాస్కరం' అనబో యిందేమో? కాదు. బావ అనే అనబోయింది. 'బా'ను సరళంగానే పలికింది.

ఇప్పుడు ఎంగిలి కంచాల్లో గిన్నెల్లో వడ్డించడం లేదు. విస్తరాకులు వరుస్తున్నారు. తెల్లవారి పూట కాఫీ, టిఫిను ఇస్తున్నారు. మూడు రోజులూ వేడి నీటి స్నానం. ఎందుకీ మర్యాదంతా? తాను సంపాదన పరుడనేనా...?"

మూడో నాటి ఉదయం సుశీలతో అన్నాడు. "ఇదిగో సుశీ! అమ్మతో చెప్పు. నేను సాయంత్రం వెళ్ళిపోతున్నానని"

ఆమె మొఖం ముంచించుకు పోయింది. "సాయం కాలం వెళ్ళిపోతావా?" ఆ ప్రశ్నలో జాలి ఇమిడి పోయి ఉంది.

సుశీల పెరట్లోకి వెళ్ళింది. వింటున్నాడు తాను.

"అమ్మా! సాయంత్రం వెళ్ళి పోతార్ట!"

"ఎవరేసి?"

"బావేనమ్మా! సాయంత్రం వెళ్ళి పోవాలం టు టున్నాడు"

భాస్కరం హృదయం పులకించి పోయింది.

"సాయంకాలం వెళ్ళి పోతానన్నావుటగా భాస్కరం?" అంటూ తడిచేతులను విదిలించుకుంటూ వచ్చింది రాధమ్మ.

"ఔనక్కయ్యా!"

"ఏం? ఇంకో రెండు రోజులుండి పోరాదుట్రా?"

"ఊహూ! వీల్లేదక్కయ్యా. వెళ్ళాలి. లీవు అయిపో వచ్చింది."

రాధమ్మ బదులు పలుకలేదు.

ఆ మధ్యాహ్నం రెండు గంటలు పై బడ్డాక ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది. శ్రీహరి బావ, పిల్లలూ స్కూళ్ళకు వెళ్ళిపోయారు. నట్టింట్లో చంటి బిడ్డను ప్రక్కనేసు కుని నిద్రపోతోంది రాధమ్మ. నడవలో బెంచీమీద పరుపు పరుచుకుని భాస్కరం నిద్ర పోతున్నాడు.

సుశీల బెదురుగా చుట్టూ కలయ జూచి తిన్నగా అతని దగ్గరకు వచ్చి, తల వేపు కూర్చుంది. అతని ఉంగరాల జుట్టులోనికి వ్రేళ్ళు పోనిచ్చి అతని మొహం లోకి ఆప్యాయంగా చూసింది. భాస్కరం ఉలికి పడి కన్నులు తెరిచాడు. సుశీల కనిపించింది. విస్తు పోతూ లేచి కూర్చున్నాడు. "ఏమిటి సుశీ! ఇక్కడ కూర్చు న్నావు?" అన్నాడు. ఆమె అతని మొహం లోనికి రెండు క్షణాలు చూసి, తలవంచుకుంది.

కరిగి నీరై పోయాడు భాస్కరం. ఆమె రెండు చేతులూ అంది పుచ్చుకుని, చేతులను తన గుండెల మీద ఉంచుకున్నాడు.

"చెయ్యి విడువు బావా! అమ్మ చూస్తుంది, వెళ్ళాలి" అంది.

ఆమె చేతులు విడిచేసి "సరే వెళ్ళు! ఇప్పుడు తప్పించుకున్నా పెళ్లినాటికి ఎలా తప్పించుకుంటావో చూస్తాను" అన్నాడు.

కిలకిల నవ్వుతూ "పో బావా", అంటూ అతని చెక్కిలిని చురుకు మనిపించి, అక్కడి నుంచి వెళ్లి పోయింది సుశీల.

ఆ సాయంకాలం అతను వెళ్ళిపోతుంటే, సుశీల కన్నుల్లో దైన్యం తాండవించింది. అతను చెరువు కట్ట వెంబడే నడిచి రోడ్డు మీదికి వచ్చాడు. బస్సు వచ్చి ఆగింది. కొండంత భాస్కరం బస్సులో జొరబడ్డాడు. సీటులో పొందికగా కూర్చుని, తన కోరమీసాలను మెలి పెట్టుకుంటూ, బస్సు స్వగ్రామపు పొలి మేరల్లోకి వచ్చేలోగానే, తన పెళ్ళిని గురించి తీయని కల ఒకటి కనేశాడు.

*రచయిత చిరునామా:
పాకాల (పోస్ట్)
చిత్తూరుజిల్లా—517112.